మొఘలులు- సాంస్కృతిక వికాసం

ప్ర:మొఘలుల వాస్తు కళను వివరించండి?

జ: ఢిల్లీ సుల్తానుల కాలంలో మొదలైన ఇండో పర్షియన్ వాస్తు శైలి మొఘలుల కాలంలో పరిపూర్ణత సంతరించుకుంది. అంతే కాక మొఘలుల వాస్తు శైలిలో దేశీయ ప్రభావం కూడా అధికమే. అన్ని ప్రాంతాల వారు ఈ కృషిలో పాల్పంచుకోవడంతో మొఘలుల శైలి జాతీయ శైలిగా గుర్తింపు పొందింది.

కోటలు, భవనాలు, మసీదులతోపాటు తోటలను కూడా నిర్మించారు. వారి కట్టడాలన్నిటిలో 'ప్రవహించే నీరు' ఒక ముఖ్య లక్షణంగా కనిపిస్తుంది. గుమ్మటాలకు స్తంభాలను జోడించడం, గుమ్మటంపై గుమ్మటాన్ని నిర్మించడం (డబుల్ డోమ్), బెంగాలీ, గుజరాత్ వంటి దేశీయ శైలి విశేషాలను స్వేచ్ఛగా వినియోగించడం, అలంకరణకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి లక్షణాలున్నాయి.

బాబర్, హుమాయూన్‌లు కొన్ని మసీదులను మాత్రమే నిర్మించారు. వాస్తవానికి మొఘలుల హస్తకళ అక్బర్ కాలంలోనే స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంది. అక్బర్ తన కట్టడాల్లో ప్రధానంగా ఎరుపు రంగు, ఇసుక రాయిని వినియోగించాడు.

అక్బర్ ఆగ్రా, అలహాబాద్, లాహోర్ వంటి ప్రాంతాల్లో కోటలు నిర్మించాడు. ఈ నిర్మాణాల్లో బెంగాలీ, గుజరాతీ శైలులకు చెందిన బాల్కనీలు, మండపాలు, గోపురాలు వంటి అంశాలను పొందుపరిచారు.

అక్బర్ నిర్మాణాల్లో ప్రత్యేకమైంది హుమాయూన్ సమాధి. పాలరాతి గుమ్మటం, డబుల్‌డోమ్ నిర్మాణం, సమాధిని ఉద్యానవనం మధ్యలో నిర్మించడం ప్రత్యేక లక్షణంగా పేర్కొనవచ్చు. తాజ్ మహల్ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చిన కట్టడాల్లో ఇదొక ముఖ్యమైన కట్టడం.

ఆగ్రాకు సమీపంలో ఫతేపూర్ సిక్రీ వద్ద కొత్త రాజధానిని నిర్మించిన అక్బర్ అక్కడి భవనాల్లో దేశీయమైన శ్లాబ్ అండ్ బీమ్ పద్ధతిని విస్తృతంగా వినియోగించాడు. అక్కడి మత సంబంధ నిర్మాణాల్లో జామా మసీద్, చిష్టీ సమాధి ప్రముఖమైనవి. గుజరాత్ విజయానికి ప్రతీకగా జామా మసీదుకు బులంద్ దర్వాజా అనే మహాద్వారాన్ని అక్బర్ నిర్మించాడు.

ఫతేపూర్ సిక్రీలోని మతేతర కట్టడాల్లో పంచ మహల్, దివానీ ఖాస్ ముఖ్యమైనవి. పంచమహల్‌ను బౌద్ధ విహార ప్రణాళికను అనుసరిస్తూ పిరమిడ్ ఆకారంలో ఐదంతస్తులుగా నిర్మించారు. దీని నిర్మాణంలో అన్ని రకాల దేవాలయ స్తంభాల నమూనాలను ప్రయోగించారు. దివానీఖాస్‌లో శిల్ప సంపదతో కూడిన స్తంభ మకుటాలు ప్రసిద్ధి చెందాయి.

జహంగీర్:

ఇతని కాలంలో కొన్ని కొత్త లక్షణాలు ప్రవేశించాయి. ఇసుక రాయి స్థానంలో ఖరీదైన పాలరాయి వినియోగం, గుమ్మటంపై గుమ్మటాన్ని నిర్మించడం, పీట్రాడ్యురా అనే అలంకరణ పద్ధతి ప్రచారంలోకి వచ్చాయి. ఇతని కట్టడాల్లో అక్బర్ సమాధిని ప్రముఖంగా ప్రస్తావించవచ్చు. ఉద్యానవనం మధ్యలో ఈ సమాధిని నిర్మించాడు. ఉద్యానవనం చుట్టూ పెద్ద ప్రాకారం అందులో నాలుగు మహా ద్వారాలు నిర్మించాడు. గజ, హంస, పద్మ, స్వస్తిక, చక్రం వంటి ప్రతీకలను అలంకరణకు వినియోగించారు.

జహంగీర్ కాలంలో నూర్జహాన్ తన తండ్రి ఇతమదుద్దౌలా కోసం నిర్మించిన సమాధి ప్రత్యేకమైంది. పూర్తి గా పాలరాయి నిర్మాణం. అలంకరణలో భాగంగా వివిధ రకాల పుష్పలతలను చెక్కి వాటిలో విలువైన రాళ్లను పొదిగారు. ఈ పద్ధతినే పీట్రాడ్యురా అంటారు. తాజ్‌మహల్ నిర్మాణానికి ఈ సమాధి కూడా స్ఫూర్తినిచ్చింది.

షాజహాన్:

షాజహాన్ వైభవం ఆయన కట్టడాల్లో ప్రతిబింబించింది. ఆయన కట్టడాల్లో ఢిల్లీలో నిర్మించిన ఎర్రకోట ముఖ్యమైంది. అందులో దివానీ ఆమ్, దివానీఖాస్, రంగ్‌మహల్ ప్రసిద్ధమైనవి. ఆగ్రాలో మోతీ మసీదు, ఢిల్లీలో జామా మసీదు నిర్మించాడు. మోతీ మసీదు మూడు గుమ్మటాల్లో ఉన్న పాలరాతి నిర్మాణాన్ని నల్ల చలువరాతిపై అలంకరణ కోసం వినియోగించడం విశేషం. జామా మసీదు కింది భాగం ఇసుక రాయితో, గుమ్మటాలు పాల రాయితోను ఉన్నాయి.

షాజహాన్ నిర్మాణాలన్నిటిలోను తలమానికమైంది ఆయన తన భార్య స్మృత్యర్థం ఆగ్రా వద్ద నిర్మించిన తాజ్‌మహల్. పాలరాతి వేదికపై అష్టభుజ ప్రణాళికతో తాజ్‌మహల్‌ను నిర్మించారు. వేదికపై నాలుగు అంచుల్లో సన్నని నాజూకైన మీనార్‌లను నిలబెట్టారు. మీనార్‌లకు పైభాగంలో స్తంభాలతో కూడిన గుమ్మటాలు నిలబెట్టారు. తాజ్‌మహల్ లోపల పీట్రాడ్యురా పద్ధతిలో పుష్పలత నమూనాలతో అలంకరణ చేశారు. తాజ్‌మహల్ నిర్మాణంలో ఉన్న సమతుల్యమే దాని అందానికి కారణం. గొప్ప ఉద్యానవనం మధ్య తాజ్‌మహల్‌ను నిర్మించడం జరిగింది.

ఔరంగజేబ్:

సనాతన భావాలు కలిగిన ఔరంగజేబ్ కళలను నిర్లక్ష్యం చేశాడు. ఆయన హయాంలో వాస్తులో చెప్పుకోదగిన పురోగతి లేదు.

అంతకుముందు ఉన్న కట్టడాలను మొరటుగా అనుకరించే ప్రయత్నం జరిగింది. ఇందులో ఔరంగాబాద్ వద్ద నిర్మించిన ఆయన భార్య సమాధి ఒక ఉదాహరణ.

ప్ర:మొఘలుల చిత్రకళ వైభవం, చిత్రలేఖనానికి వారు చేసిన సేవలను వివరించండి?

జ: మొఘలులు చిత్రలేఖనంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. తొలి దశలో పర్షియన్ శైలిని ఆదరించినప్పటికీ క్రమంగా దానికి భారతీయతను జోడించారు. మొఘలులు చిత్ర లేఖనంలో కొత్త వస్తువులు ఉదాహరణకు: దర్బార్ దృశ్యాలు, యుద్ధం, వేట వంటి దృశ్యాలను ప్రవేశపెట్టారు. కొత్త నైపుణ్యాలను, రంగులను ప్రవేశపెట్టారు. ప్రకృతి దృశ్యాలను, జంతువులను, వృక్షాలను చిత్రించే ప్రయత్నం కూడా జరిగింది. భారతీయ భౌగోళిక నేపథ్యానికి సంబంధించిన బోధి, మామిడి, మర్రి చెట్ల వంటి వృక్షాలను, జింక, సింహం, ఏనుగు వంటి జంతువులను చిత్రించారు.

హుమాయూన్ పర్షియాలో తలదాచుకున్నప్పుడు పర్షియన్ చిత్రకారులతో పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆ తర్వాత హుమయూన్ ఆహ్వానం మేరకు మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్, అనే ప్రసిద్ధ పర్షియన్ చిత్రకారులు మొఘల్ ఆస్థానంలో ప్రవేశించారు. అక్బర్ కాలంలో కూడా కొనసాగారు.

అక్బర్ కాలంలో తొలిదశలో చిత్రలేఖనంపై పర్షియన్ ప్రభావం బాగా కనిపించింది. 1556-60 మధ్య 'హమ్జానామా' లోని చిత్ర లేఖనాల్లో పర్షియన్ ప్రభావం కనిపిస్తుంది. 1560ల నుంచి భారతీయ శైలికి ప్రాధాన్యం పెరిగింది. 'తాన్‌సేన్ ఆగమనం' అనే చిత్ర లేఖనంలో ఈ మార్పు కనిపిస్తుంది. చిత్రలేఖనాన్ని పోషించేందుకు ఒక ఖార్ఖానాను ఏర్పాటు చేశాడు. అన్ని ప్రాంతాలు, మతాల వారు చిత్రలేఖన కృషిలో పాల్గొన్నారు. ఇతని ఆస్థానంలోని చిత్రకారుల్లో లాల్, ముకుంద్, కేశవ్, హర్బంశ్, దశ్వన్ వంటి హిందువులు కూడా స్థానం పొందారు. చిత్రలేఖనంలో వాస్తవికత ఉట్టిపడేలా 'త్రిమితీయ స్వభావం' అనే భారతీయ లక్షణాన్ని జోడించడం జరిగింది. చిత్రలేఖనంలో పర్షియన్ ప్రభావం పోయి.. భారతీయ వేష భాషలు, ఆభరణాలు చిత్రీకరణకు నోచుకున్నాయి. అలాగే పుస్తకాల్లో వివరణాత్మక చిత్ర లేఖనాలకు చోటు లభించింది. రమ్జానామా, అక్బర్ నామా వంటి గ్రంథాల్లో ఇవి కనిపిస్తున్నాయి. అక్బర్ కాలంలో భారతీయ నెమలి వర్ణం, భారతీయ ఎరుపు వర్ణం వంటి రంగులు మొఘల్ చిత్రలేఖనంలోకి ప్రవేశించాయి. అంతేకాక చిత్రలేఖనంపై యూరోపియన్ ప్రభావం ప్రసరించింది. ఈ ప్రభావంతోనే దూరంగా ఉన్న వస్తువులను చిన్నవిగా, దగ్గరిగా ఉన్న వస్తువులను పెద్దవిగా చిత్రించే పద్ధతి మొదలైంది.

జహంగీర్ కాలంలో మొఘల్ చిత్రకళ తారస్థాయికి చేరుకుంది. జహంగీర్ అద్భుత చిత్రకళా విమర్శకుడు. ప్రకృతి మీద ఆయనకు గల మమకారం వల్ల పక్షులు, జంతువుల బొమ్మలను చిత్రించడం ఎక్కువైంది. ఆయన కాలంలోని చిత్రకారుల్లో ఆగా రేజా, నాదిర్, మురాద్, మన్సూర్ వంటి ముస్లిం చిత్రకారులే కాక బిషన్‌దాస్, మనోహర్, గోవర్ధన్ వంటి హిందూ చిత్రకారులు కూడా ఉన్నారు. జంతువులు, పక్షుల చిత్రాల్లో మన్సూద్ ప్రసిద్ధుడు. మానవ మూర్తులను చిత్రించడం, లఘుచిత్రకళ కూడా ప్రచారంలోకి వచ్చింది. ఒకే చిత్రాన్ని పలు చిత్రకారులు గీసే పద్ధతి కూడా ప్రచారంలోకి వచ్చింది. ఈయన కాలంలో రాజును దైవాంశ సంభూతుడిగా చూపించే ప్రయత్నం జరిగింది. ఇందు కోసం యూరోపియన్ పద్ధతులను అనుసరిస్తూ చక్రవర్తికి నేపథ్యంలో విశ్వం లేదా, బంగారు కిరణాలను చూపించేలా చిత్రీకరణ జరిగింది.

స్వతహాగా చిత్రకారుడైన షాజహాన్ కాలంలో చిత్రలేఖనంలో సాంకేతిక పరిపక్వత నోచుకున్నప్పటికీ.. జీవ కళ తగ్గిపోయింది. బంగారు రంగు వంటి ఖరీదైన రంగుల వినియోగం పెరిగింది.చక్రవర్తి గొప్పతనాన్ని చిత్రించేందుకు ఇతరులందరినీ సూక్ష్మ పరిమాణంలో చిత్రించడం మొదలైంది.

షాజహాన్ కుమారుడైన దారాషుకోవ్ కూడా చిత్రలేఖనాన్ని పోషించాడు. జంతువులు, పక్షుల బొమ్మలతో కూడిన ఆయన ఆల్బమ్ ఇందుకు సాక్షి.

ఔరంగజేబ్ సనాతన భావాలతో చిత్రలేఖనాన్ని నిర్లక్ష్యం చేశాడు. ఆయన అనంతరం కూడా మొఘల్ చిత్రలేఖనం కొనసాగినప్పటికీ నాణ్యత క్షీణించింది. పాత నమూనాలను పదేపదే చిత్రించడం, కామ ప్రేరక అంతఃపుర దృశ్యాలను చిత్రించడం ఎక్కువైంది. 18వ శతాబ్దం నాటికి మొఘల్ చిత్రలేఖన శైలి క్షీణించినప్పటికీ అది లక్నో, పాట్నా, ముర్షీదాబాద్, దక్కన్ చిత్ర శైలులను ప్రభావితం చేసింది.

ప్ర:మొఘలుల కాలంలో జరిగిన వివిధ కళల అభివృద్ధిని వివరించండి?

జ: మొఘలులు వాస్తు, చిత్ర లేఖనాలతోపాటు సంగీత సాహిత్యాలను కూడా సమంగా ఆదరించారు. వీరి వాస్తు శైలి విశిష్టమైంది. సుల్తానుల కాలంలో మొదలైన ఇండో పర్షియన్ శైలి మొఘలుల కాలంలో పరిపక్వదశకు చేరుకుంది. అంతేకాక అందులో భారతీయత ఎక్కువైంది. అక్బర్ ఫతేపూర్ సిక్రీలో నిర్మించిన కట్టడాల్లో దేశీయత ఎక్కువగా కనిపిస్తుంది. జహంగీర్ కాలపు కట్టడాల్లో అక్బర్ సమాధి, ఇతిమదుద్దౌలా సమాధి చెప్పుకోదగినవి. షాజహాన్ వాస్తుకళలో వైభవోపేత యుగాన్ని ప్రారం

భించాడు. ఆయన కట్టడాల్లో ఢిల్లీలో నిర్మించిన ఎర్రకోట, జామా మసీదు, ఆగ్రాలోని మోతీ మసీదులు ప్రత్యేకమైనవి. ఆగ్రా వద్ద పూర్తిగా పాలరాయితో నిర్మించిన తాజ్‌మహల్ ఆయన నిర్మాణా లన్నింటిలోకి విశిష్టమైంది.

మొఘలులు చిత్రకళపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అక్బర్ కాలంలో తొలిదశలో చిత్రకళపై పర్షియన్ ప్రభావం ఎక్కువగా ఉండేది. క్రమేణా అందులో భారతీత ఎక్కువైంది. అంతేకాక చిత్ర కళపై యూరోపియన్ ప్రభావం మొదలైంది. జహంగీర్ కాలం మొఘల్ చిత్రకళకు ఉచ్ఛదశ. ఆయన కాలంలో పక్షులు, జంతు వులు, మానవ మూర్తుల చిత్రీకరణ ఎక్కువైంది. షాజహాన్ కాలంలో ఖరీదైన రంగుల వాడకం ఉన్నప్పటికీ జహంగీర్ కాలం నాటి ప్రమాణాలు దిగజారాయి. ఔరంగజేబ్ కాలం నుంచి మొఘల్ చిత్రకళ క్షీణించింది.

మొఘలుల కాలంలో పర్షియన్ రాజభాషగా విస్తృత ప్రచారం పొందింది. పర్షియన్ గద్య శైలికి అబుల్ ఫజుల్ ఒరవడి దిద్దారు. ఫైజీ, ఉత్బే, నాజీరీ వంటి వారు పర్షియన్ కవిత్వాన్ని సుసం పన్నం చేశారు.

చరిత్ర రచన కూడా మొఘలుల కాలంలో వికసించింది. అబు ల్‌ఫజల్ 'అక్బర్‌నామా'; అబ్దుల్ హమీద్ లాహోరీ 'షాద్‌షానా మా'; ఇనాయత్‌ఖాన్ 'షాజహాన్‌నామా'; ఖాసీఖాన్ 'ముంత కాబ్ ఉల్ లబాబ్' కొన్ని ఉదాహరణలు. బాబర్ 'తుజుక్-ఇ-బా బరీ', జహంగీర్ 'తుజుక్ -ఇ- జహంగీరి' ప్రసిద్ధ స్వీయ చరి త్రలు.

జాయసీ,అబ్దుల్ రహీమ్, ఖాన్-ఇ-ఖనాన్ తులసీదాస్, సూర్‌దాస్ రచనలు హిందీని సుసంపన్నం చేశాయి. ఏక్ నాథ్,తుకారాంల కృషి వల్ల మరాఠీ; సిక్కు గురువుల కృషి వల్ల పంజాబీ అభివృద్ధి చెందాయి.

సంగీతం:

మొఘలులు సంగీతాన్ని కూడా పోషించారు. అక్బర్ కాలంలో గ్వాలియర్‌కు చెందిన 'తాన్‌సేన్' ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు. అక్బర్ కాలంలో 36 మంది సంగీతకారులు ఉన్నట్లు అబుల్‌ఫ జుల్ పేర్కొన్నాడు. జహంగీర్, షాజహాన్‌లు కూడా సంగీతాన్ని పోషించారు. ఔరంగజేబ్ సంగీతాన్ని పూర్తిగా నిషేధించాడనేది వాస్తవం కాదు. ఆయన తన దర్బార్‌లో గాత్ర సంగీతాన్ని నిషేధిం చాడు. వాద్య సంగీతాన్ని నిషేధించలేదు. ఆయన స్వయంగా అద్భుతంగా వీణ వాయించేవాడు. ఆయన అంతఃపురంలో, ఉద్యోగుల నివాసాల్లో సంగీతం ఎంతో ఆదరణకు నోచుకుంది. ఆయన కాలంలోనే అత్యధిక సంఖ్యలో సంస్కృత రచనలను పర్షి యన్‌లోకి అనువదించడం జరిగింది.